ప్రజాశక్తి
గురువారం 10 అక్టోబర్ 2024 5
శ్రీ సత్యసాయి

## కేసులను పూర్తిస్థాయిలో పరిశీలించాలి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

డిసిఆర్‌బి శాఖలో సిబ్బంది అన్ని కేసులను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారంపై అవగాహన పెంచుకోవాలిని ఎస్పీ వి.రత్న సూచించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో డిసిఆర్‌బిలోని అన్ని విభాగాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ, లోకాయుక్త, రౌడీషీటర్స్, చోరీలు, తదితర వాటిపై సమీక్షించారు. జిల్లాలో జరిగే నేరాలు, తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కేసులను చేధించాలని సూచించారు. ఈ సమావేశంలో డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, ఐటీ కోర్ టీం సిబ్బంది సుదర్శన్ రెడ్డి, డిసిఆర్‌బి సిబ్బంది పాల్గొన్నారు.

# పప్పుశనగకు ఎదురుచూపులే..!

సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. అడిగిన రైతులందరికీ సబ్సిడీ విత్తనాలు అందిస్తామని ఆర్భాటంగా ప్రభుత్వం, అధికారులు ప్రకటించినా ఆచరణలో నిర్లక్ష్యం కన్పిస్తోంది. ఎకరాకు 40 కిలోల చొప్పున 5 ఎకరాలున్న రైతుకు పది బస్తాల పప్పుశనగ విత్తనాలను 25శాతం రాయితీతో పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. ప్రకటన బాగానే ఉన్నా ఆచరణలోకి వచ్చే సరికి పంపిణీ కార్యక్రమం అనుకున్న స్థాయిలో రైతులకు మేలు చేయడం లేదు.

◆ రైతులకు అందని సబ్సిడీ విత్తనం
◆ విత్తన సమయం ఆరంభమైనా పంపిణీ కాని వైనం
◆ రసీదులతో సరిపెడుతున్న అధికారులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

పప్పుశనగ సాగు నిమిత్తం ఐదు ఎకరాలున్న రైతుకు పది బస్తాలను సబ్సిడీతో ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే అధికారులు ఐదు బస్తాలతోనే సరిపెడుతున్నారు. ప్రభుత్వం కిలో పప్పుశనగ రూ.94 ధర ఖరారు చేసింది. అందులో 25 శాతం ప్రభుత్వ రాయితీ పోగా రైతు వాటా కింద రూ.70.50 చెల్లించాల్సి ఉంది. ఇదే ధరకు బయట మార్కెట్లో సైతం విత్తనాలు లభిస్తున్నాయి. బయట మార్కెట్‌కు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీ విత్తనాలకు ధరలో పెద్ద వ్యత్యాసం ఉండడం లేదు. దీంతో రైతులు బయట మార్కెట్లో కొనుగోలు చేస్తున్నారు. అందులోనూ 5 ఎకరాలున్న రైతుకు 10 బస్తాలు ఇవ్వాల్సి ఉండగా 5 బస్తాలనే ఇస్తున్నారు. ఓ వైపు ధర ఎక్కువగా ఉండడం, మరోవైపు ఇస్తున్న బస్తాల్లో కోత విధించడంతో సబ్సిడీ పప్పుశనగ విత్తన పంపిణీ రైతులకు ఏమాత్రం ఉపయోగ పడడం లేదు. గత ప్రభుత్వంలో విత్తన పంపిణీ సమయంలోనే విత్తన శుద్ధి చేసుకునే మందు కూడా తక్కువ ధరకే పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఇది ఇవ్వడం లేదు.

గత రెండు వారాల నుంచి తాడిపత్రి మండలంలోని చల్లవారిపల్లి, పెద్దపడమల, కొట్టాలపల్లి, కొండేపల్లి తదితర గ్రామాల్లో రైతులు పప్పుశనగ విత్తనాలను సాగు చేస్తున్నారు. అదును దాటుతున్నా సబ్సిడీపై ప్రభుత్వం ఇస్తున్న విత్తనాలు అందకపోవడంతో ఈగ్రామాలకు చెందిన చాలా మంది రైతులు ప్రయివేటు మార్కెట్లో కొనుగోలు చేసి విత్తుతున్నారు. సబ్సిడీ విత్తనాలు ఇచ్చేందుకు అధికారులు ఆయా సచివాలయాల పరిధిలోని రైతులకు పాసుపుస్తకాల ద్వారా వివరాలు తీసుకుని కేవలం రసీదులు మాత్రమే ఇచ్చారు. వీటికి సంబంధించి విత్తనాలు మాత్రం ఇంత వరకు ఇవ్వలేదు. ఈ పరిస్థితుల్లో రైతులు విత్తనాలను బయట కొనుగోలు చేయకతప్పడం లేదు.

బయట మార్కెట్లో పప్పుశనగ విత్తనాలు కొనుగోలు చేసి విత్తుకుంటున్న రైతులు

### బయట మార్కెట్ ధర ఒకేలా ఉంది..

పప్పుశనగకు సంబంధించి బయట మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రాయితీ ఇస్తున్న ధరకు పెద్దగా వ్యత్యాసం లేదు. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలనూ అరకొరగానే ఇస్తున్నారు. వీటిని కూడా ఇప్పటివరకు మా గ్రామంలో ఇవ్వలేదు. అధికారులు కేవలం రసీదులు ఇచ్చి కాలం గడుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి రాయితీ పెంచి, పూర్తి స్థాయిలు విత్తనాలను సమకూర్చేలా చర్యలు తీసుకోవాలి.

**జనార్ధన్ నాయుడు, రైతు, చల్లవారిపల్లి గ్రామం.**

### పది బస్తాలు ఇవ్వాలి

ప్రభుత్వం ప్రకటించిన విధంగా పప్పుశనగ విత్తనాలు ఎకరాకు 40 కిలోలు, 5 ఎకరాలకు పది బస్తాలు ఇవ్వాలి. విత్తన పంపిణీలో కొందరు అధికారులు చేతివాటం చూపించి ఐదు ఎకరాల రైతులకు ఐదు బస్తాలు మాత్రమే ఇస్తున్నారు. ఇప్పటికీ ఇంకా రసీదులను మాత్రమే రైతులకు ఇచ్చారు. పంపిణీ ఆలస్యమైతే సాగు చేయడానికి వీలుండదు. సబ్సిడీని మరింత పెంచి రైతులకు తక్కువ ధరకు విత్తనాలు పంపిణీ చేయాలి.

**రాజారామి రెడ్డి, రైతుసంఘం నాయకులు, తాడిపత్రి.**

### విత్తనాలు అందిస్తాం

రైతులకు సబ్సిడీ పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నాం. సబ్సిడీ విత్తన పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి మరో ప్రకటన రానుందని, అప్పుడు అడిగిన ప్రతి రైతుకూ విత్తన పంపిణీ చేస్తాం.

**చంగల రాయుడు, తాడిపత్రి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు.**

# సాగునీటి సంఘాల ఎన్నికల జోష్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

చాలాకాలం తరువాత సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధం అవుతోంది. ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి మంగళవారం నిర్వహించిన సమీక్షలో ప్రకటన చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లో మరో ఎన్నికల జోష్ నెలకొంది. ముఖ్యంగా అధికార టిడిపి నేతలు ఈ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. వైసిపి పరిస్థితి ఏ రకంగా ఉంటుందన్నది చూడాల్సి ఉంది. ఎన్నికలు రాజకీయ గుర్తులపై కానప్పటికీ అధికార పార్టీ నేతలు తమ పట్టు నిలుపుకునేందుకు సిద్ధమవుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 375 సంఘాలు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 375 సాగునీటి సంఘాలున్నాయి. ఇందులో 70 సంఘాలు సాగునీటి కాలువల పరిధిలో ఉండగా, చెరువులో 305 సంఘాలున్నాయి. ఇందులో మేజర్ ప్రాజెక్టుల పరిధిలో 48 కాగా, మీడియం పరిధిలో 22 సంఘాలు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 305 ఉన్నాయి. వీటన్నింటికీ త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. టిబిహెచ్ఎల్‌సి పరిధిలో మొత్తం 99 సాగునీటి సంఘాలున్నాయి. హెచ్ఎల్‌సి పరిధి అనంతపురం జిల్లాతోపాటు కర్నూలు, కడప జిల్లాల్లోనూ ఉన్నాయి. వీటన్నింటి నిర్వహణ టిబి హెచ్ఎల్‌సి పరిధిలోనే జరుగుతాయి. జిల్లాల వారీగా చూస్తే అనంతపురం జిల్లాలో 46 సాగునీటి సంఘాలుడగా ఐదు డిస్ట్రిబ్యూటరీ సంఘాలున్నాయి. కర్నూలు జిల్లా పరిధిలో ఆరు, కడప జిల్లా పరిధిలో 46 సంఘాలున్నాయి. ఈనెల 16వ తేదిన నోటిఫికేషన్ జారీ చేయడంతోపాటు 40 రోజుల్లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తవనుందని మంత్రి ప్రకటించారు.

### గ్రామాల్లో సిద్ధమవుతున్న నేతలు




**వైసిపి పాల్గొనేనా ?**

చాలా కాలం తరువాత సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతుండటంతో రాజకీయంగానూ ఆసక్తికరంగానే మారింది. వైసిపి ఈ ఎన్నికల్లో పాల్గొంటుందా.. లేదా.. అన్నది చూడాల్సి ఉంది. గత సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఘోర ఓటమిని చవిచూసింది. ఆ పార్టీ ఓటమి నుంచి ఇంకా తేరుకోలేదు. ముఖ్య నేతలే ఇంకా పార్టీ కార్యక్రమాల్లో అంటీముట్టనట్టు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోటీకి సిద్ధపడే అవకాశాలు చాలా వరకు తక్కువగానే ఉన్నాయి. దీంతో ఈ ఎన్నికలు ఏకపక్షంగా సాగే అవకాశాలే ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా. ఇక అధికారపార్టీ నేతల్లో మాత్రం ఎక్కడలేని ఉత్సాహం నెలకొంది. పార్టీ అధికారంలోకి వచ్చిన సమయంలో ఈ ఎన్నికల్లో పోటీ చేసి పదవులు దక్కించుకోవాలని ఉత్సమం చూపుతున్నారు.

# వాతావరణంకు అనుగుణంగా మార్పులు

◆ జిల్లాలో పది గ్రామాల్లో సిఆర్‌విడిపి అమలు ◆ రెండు రోజుల సదస్సులో ఎఎఫ్ ఎకాలజీ కసరత్తు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గ్రామ సుస్థిరాభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరముంది' అని ఐఐఎస్‌సి (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సు) ప్రొఫెసర్ ఎన్‌హెచ్.రవీంద్ర నాథ్ పేర్కొన్నారు. అనంతపురంలోని ఎఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పది గ్రామాల్లో క్లైమెట్ రిజిలెంట్ విలేజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (సిఆర్‌విడిపి) అమలు చేయాలని తలపెట్టింది. దీని అమలుకు ముందుగా నిపుణులతో అవసరమైన కసరత్తును చేపట్టింది. ఇందులో భాగంగా బుధ, గురువారాలు రెండు రోజుల పాటు ఎఎఫ్ ఎకాలజీ కేంద్రంలో సదస్సును చేపట్టింది. ఈ సదస్సు ప్రారంభోపన్యాసం ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి చేపట్టారు. అనంతపురం జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, పంటల సరళి అన్ని అంశాలను విశదీకరించారు. అనంతరం సిఆర్‌విడిపి గురించి ఎఎఫ్ ఎకాలజీ పిఎంఇ లీడ్ బ్రహ్మేశ్వర్ తెలియజేశారు. ఐఐఎస్‌సి ప్రొఫెసర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ కర్బన ఉద్గారాలు, కాలుష్యం పెరిగిన నేపథ్యంలో వాతావరణంలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని తెలిపారు. ఒకటి, రెండు సంవత్సరాల్లో ఇది పరిశీలిస్తే అర్థం అవుతుందని చెప్పారు. గడిచిన మూడు, నాలుగు దశాబ్దాల గణాంకాలు తీసుకుని పరిశీలిస్తే వాతావరణంలో ఎటువంటి వైవిధ్యం ఏర్పడుతోందన్నది స్పష్టం అవుతుందని తెలియజేశారు. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ముందస్తు అంచనా వేయగలుగుతున్నప్పటికీ కొద్ది కాలానికి మాత్రమే అందుబాటులో ఉందని చెప్పారు. ఏడాది ముందుగానే వాతావరణ పరిస్థితులను అంచనా వేసి అందుకు అనుగుణమైన నష్ట నివారణ చర్యలు తీసుకునే విధమైన సాంకేతికత ఇంకా అందుబాటులోకి రాలేదని వివరించారు. వస్తున్న మార్పులను అంచనా వేసి అందుకు అనుగుణమైన మార్పులతో వ్యవసాయరంగంలో తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. అప్పుడు నష్టాన్ని చాలా వరకు తగ్గించుకోగలమని వివరించారు. ఐఐఎస్‌సి సభ్యురాలు సుష్మ అనంతపురం జిల్లాలో చోటు చేసుకున్న వాతవరణ మార్పులను అధ్యయనం చేశారు. వీటి వివరాలను ఆమె వివరించారు. అనంతపురం జిల్లాలో తాము పది మండలాలను పరిశీలించినట్లు చెప్పారు. అందులో 45 శాతం వర్షపాతంలో ఏటా వ్యత్యాసం ఉంటోందన్నారు. ఒక్క సంవత్సరం పడితే ఎక్కువైనా పడుతుంది... లేదా సగానికిపైగా తక్కువైనా పడుతోందన్నారు. ఇది పంటలపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో తమ సంస్థ ఆధ్వర్యంలో అనుసరించిన సస్యరక్షణ యాజమాన్య పద్ధతుల గురించి శాస్త్రవేత్త యలమందారెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా వ్యవసాయాధికారిణి మల్లేశ్వరమ్మ ఈ సదస్సులో పాల్గొని జిల్లాలో పంటల సరళి, వాతావరణ ప్రభావాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ఎస్‌కె ప్రిన్సిపల్ సైంటిస్టు విజయశంకర్ బాబు, క్రీడా డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు, సాంతిక సహాయకులు సికె. గంగూలి, బక్తర్ వలి, ఎఎఫ్ ఎకాలజీ ప్రతినిధులు మురళీకృష్ణ, మీడియా కో ఆర్డినేటర్ ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎఎఫ్ ఎకాలజీ నిర్వహించిన సదస్సును ప్రారంభిస్తున్న నిపుణులు

# ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆర్‌డిఒ మహేష్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ధర్మవరం డిఎస్‌పి, అగ్నిమాపక సిబ్బంది, నీటిపారుదల శాఖ అధికారులు, డివిజన్‌లోని ఆయా మండలాల తహశీలార్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ డివిజన్ లో ఇసుక అక్రమ రవాణా జరుగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఉచితంగా ఇసుకను ప్రజలకు అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దసరా, దీపావళి పండుగలను దృష్టిలో ఉంచుకొని టపాసుల దుకాణదారులకు లైసెన్స్ ఇచ్చే ముందు తగు జాగ్రత్త లు పాటించాలని చెప్పారు. అదేవిదంగా కొన్ని రోజుల్లో జరగనున్న నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పోలీసు యంత్రాంగం గ్రామాల్లో ఎటువంటి అవాంచనీయ ఘటనలకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. డివిజన్ లోని మండలాల్లో ఎక్కడైనా భూముల వివాదాలు, రైతులకి సంబందించిన చిన్న చిన్న సమస్యలు ఎప్పటికి అప్పుడు రెవిన్యూ అధికారులు పరిష్కారం చేసే దిశగా పని చేయాలని చెప్పారు, ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాసులు, అగ్నిమాపక సిబ్బంది, ఆయా మండలాల తహశీల్దార్లు, ఆర్ఐలు, విఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఈ క్రాప్ బుకింగ్ : జేసీ

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్

పకడ్బందీగా ఈ క్రాప్ బుకింగ్ చేపట్టాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల పరిధిలోని గోరంట్ల,పాలసముద్రం, గౌనివారి పల్లి, మలసముద్రం, మల్లాపల్లి,పులేరు గ్రామ పంచాయతీలలో ఈ క్రాఫ్ బుకింగ్ పై రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ఇంతవరకు జరిగిన ఈ క్రాఫ్ బుకింగ్ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ అల్తాఫ్ అలీ ఖాన్, మండల వ్యవసాయ అధికారి మునికృష్ణ, తహశీల్దార్ మారుతి, విఆర్ఒలు , రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్ పరిశీలిస్తున్న జేసీ

## పర్యాటకుల సంఖ్య పెంచడమే లక్ష్యం

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రంలోని దుర్గా పాపనా శేశ్వర వీరభద్ర స్వామి ఆలయానికి పర్యాటకులను పెంచడం కోసం టూరిజం శాఖ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్టు జిల్లా టూరిజం శాఖ అధికారి జయ కుమార్ బాబు తెలిపారు. గురు శుక్రవారాల్లో సాయంత్రం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ,సాంప్రదాయ నృత్యాలు, తోలుబొమ్మలాట, సంగీత కార్యక్రమాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. త్వరలోనే హరిత హోటల్ ప్రథమ అంతస్తు నిర్మాణ పనులు ప్రారంభించి భక్తులకు అందుబాటులోకి తీసుకొని వస్తామని చెప్పారు. లేపాక్షి ఆలయానికి మరింత గుర్తింపు తెచ్చేందుకు ప్రతి పండుగకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ చేతన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. శివరాత్రి జాగరణ రోజున టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహణ సన్నద్ధం కావాలని తెలిపారు.

## ఘనంగా తపాలా వారోత్సవాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణ పరిసర ప్రాంతాల్లో తపాలా వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఫిట్ పోస్ట్, ఫిట్ ఇండియా అనే నినాదంతో తపాలా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు అదనపు తపాలా సూపరింటెండెంట్ మల్లికార్జున తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయన్నారు. పోస్టు మాస్టర్ మార్కండేయ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజు తప్పకుండా వ్యాయామం, నడక, యోగా చేసి శారీరకంగా, మానసికంగా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం తపాలా కార్యాలయ, డివిజన్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా కానుకలు పంపిణీ

కానుకలు అందజేస్తున్న దాత సందా రాఘవ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

దసరా పండుగ సందర్భంగా ధర్మవరం పట్టణంలో పనిచేస్తున్న విలేకరులందరికి బుధవారం తెలుగుదేశం పార్టీ నాయకులు, చేనేత వ్యాపారి సందా రాఘవ దసరా కానుకలు పంపిణీ చేశారు. దాత సందా రాఘవ కూతురు శ్రీనిధి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి విలేకరులకు దసరా కానుకలు అందజేశారు. విలేకరుల సంఘం 'సంక్షేమనిధి' ఏర్పాటు చేస్తే వారిలో ఎవరికైనా అత్యవసరం అంటే అనారోగ్యం, పిల్లల చదువులు ఇంకా ఇతర సమస్యలు వస్తే సంక్షేమ నిధి ద్వారా ఆదుకోవచ్చని సూచించారు. అలాగే తన వంతుగా మీ విలేకరుల సంక్షేమ నిధి కి ఐదు లక్షల రూపాయలు జమ చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దాతను విలేకరుల సంఘం తరపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో సందా రవి, కొడవండ్ల పల్లి హరి, జింకా పురుషోత్తం, శ్రీశైలం పురుషోత్తంగౌడ్, పూజారి జనార్దన్ స్థానిక విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

## బహుజనుల జీవితాల్లో వెలుగు కాన్షీరామ్

ప్రజాశక్తి-హిందూపురం

బహుజనుల జీవితాల్లో వెలుగును నింపిన మహోన్నత వ్యక్తి కాన్షీరామ్ అని బిఎస్పీ నాయకులు అన్నారు. కాన్షీరామ్ 18వ వర్ధంతి సభను స్థానిక బీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికోసం, వారికి రాజ్యాధికారం కావాలన్న ఆకాంక్షతో 1984లో బిఎస్పీ పార్టీని స్థాపించారన్నారు. దేశానికి గుండెలాంటి ఉత్తర్ ప్రదేశ్‌లో నాలుగుసార్లు పార్టీ తరుపున మాయావతిని ముఖ్యమంత్రి చేశారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా బహుజనుల రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు దాసరి ఈశ్వరయ్య, ఎమ్మెల్ నారాయణ, స్టూడియో గంగాధర్, హుస్సేన్ ఖాన్, బాబు, రామాంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

## ఎంపిని కలిసిన ప్రముఖులు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణంలోని హిందూపురం పార్లమెంటు సభ్యులు కార్యాలయంలో ఎంపీ బి కె. పార్థసారథిని పలువురు కలిశారు. పరిగి మండల షెడ్యూల్ కులాల (ఎస్‌సి) సంఘ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరిగి మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అందుకు స్పందించిన పార్థసారథి మాట్లాడుతూ అందరి అభిప్రాయం మేరకు పెనుకొండ నియోజకవర్గంలో ఒక చోట అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిగి మండల షెడ్యూల్ కులాల నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి అందరి బాధ్యత

శిక్షణ తరగతుల్లో ఉపసర్పంచులు, వార్డు సభ్యులు

ప్రజాశక్తి - గాండ్లపెంట

గ్రామాల అభివృద్ధి అందరి బాధ్యత అని ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి, ఇఒఆర్‌డి సునీత తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని ఆయా గ్రామాల ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఎక్కడెక్కడ అభివృద్ధి పనులు చేయాలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులు సర్పంచు దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మూడు నెలలకు ఒకసారి ఉప సర్పంచులు వార్డు నెంబర్లు సమావేశం నిర్వహిస్తే సమస్యలు పరిశీలించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు

**కదిరి టౌన్ :** కదిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు రెండు రోజులు పాటు నిర్వహించే శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ఎంపిడిఒ పోలప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పరిపాలన, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి డి. అంజనప్ప, వివిధ గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మృతునికి సిపిఎం నివాళి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కమ్యూనిస్టు నాయకులు ధూపంపల్లి బాషా మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్, ఇతర నాయకులు ధూపంపల్లి బాషా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాషా గతంలో కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, ఆతరువాత టిడిపి నాయకుడిగా ప్రజలకు సేవలు అందించారన్నారు. ఆయన మృతి బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అంజి, ముత్యాలు, శంకర్ రెడ్డి, శ్రావణి, నాగమణి, సిద్దు, చెన్నకేశవులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అంద జేస్తున్న 'చిలకం'

## రేషన్ షాపులు ప్రారంభం

**ప్రజాశక్తి - ధర్మవరం రూరల్**

పట్టణంలోని40 వ వార్డు తారకరామాపురంలో కడపల సుధాకర్ రెడ్డి , మిరియాల లక్ష్మినారాయణ కి కేటాయించిన చౌక ధాన్యపు దుకాణాలను జనసేన రాష్ట్ర కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చౌకధాన్యపు దుకాణంలో నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని, దుకాణాలు కేటాయించిన జనసేన పార్టీ కి కూటమికి మంచి పేరు తేవాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా నటరాజ్

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

కొత్తచెరువు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా ఈవోఆర్డీ నటరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో బారన్ సాహెబ్ పెద్దవడుగూరుకు బదిలీ అయ్యారు. దీంతో నటరాజు ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు.

## వీధిదీపాలు ఏర్పాటు

**ప్రజాశక్తి - మడకశిర**

దసరా పండుగ సందర్భంగా కొన్ని పంచాయతీలోని గ్రామాలలో వీధిదీపాల ఏర్పాటుకు సర్పంచులు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు మండల పరిధిలోని వైబిహళ్లి పంచాయతీ పరిధిలోని గ్రామాలలో వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచి రామాంజనేయులు తెలిపారు. అదేవిధంగా ఆమిదాలగొంది పంచాయతీలో కూడా వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచి చెప్పారు.

## సరస్వతిదేవి అలంకరణలో దుర్గామాత

**ప్రజాశక్తి - బత్తలపల్లి**

దసరా మహోత్సవాల్లో భాగంగా ఏడవరోజైన బుధవారం దుర్గామాత సరస్వతిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత కమిటీ సభ్యులు జక్కంపూడి వెంకటేశ్వరచౌదరి, జొన్నలగడ్డ రంగానాయుడు, జాంపుల భాస్కర్, చల్లా ఓబుల నాయుడు, జాస్తి చిట్టి, వినయ్, ముళ్లగూరు సతీష్, తాళ్లూరు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అవకతవకలకు పాల్పడితే చర్యలు

**ప్రజాశక్తి - కదిరి టౌన్**

ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ పోలప్ప హెచ్చరించారు. బుధవారం కదిరి రూరల్ మండలంలోని యర్రదొడ్డి తండా పరిధిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ప్రతి రోజూ పని కల్పించాలని పని జరిగే చోట కూలీలకు సరైన వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

## రోడ్ల మరమ్మతులు

**ప్రజాశక్తి - గోరంట్ల రూరల్**

మండల పరిధిలోని పాలసముద్రం గ్రామంలో రోడ్డు ప్రయాణికులకు ఇబ్బంది కరంగా ఉండడంతో మంత్రి సవితమ్మ, హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథి ఆదేశాల మేరకు తాత్కాలికంగా మరమ్మతులు రోడ్డు మరమ్మతులను రాష్ట్ర వాల్మీకి సాధికారిక సమితి మెంబర్ బెల్లాల చెరువు చంద్ర, మనోహర్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మూర్తి, అంజినప్ప, స్టోర్ డీలర్లు గంగాధర్, ఇర్షాద్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

**మహారాజశ్రీ గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, కదిరి**
**O.S.NO:240/2014**

**Between:**

బి.శాంతమ్మ మరియు ఇతరులు ...ప్లైన్‌టిఫ్

మరియు

బి.నాగమ్మ died by L.Rs ...డిఫెన్‌డెంట్స్

D27:సయ్యద్ బాషా S/o హుస్సైన్ మియా D.No:7-111-R, పోలీస్ లైన్, తలుపుల గ్రామం మరియు మండలం.

పై దావాలో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం 15/10/2024వ తేదిన వాయిదా వేసినారు. కావున మీరు 15/10/2024వ తేదిన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా మీ వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. అట్లు హాజరు కాని పక్షంమున మీ పరోక్షమున తీర్మానం చేయబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:15/10/2024
స్థలం:కదిరి

పి.వి.శివప్రసాద్, బి.కామ్., బి.ఎల్,
వాదితరుపు వకీలు, కదిరి.

**మహారాజశ్రీ కదిరి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**
**O.S.NO:30/2016**

**Between:**

కొండపాకు నరసమ్మ W/o లేట్ పక్కీరప్ప S.C.కాలనీ, నియర్ రైల్వేగేటు, ముదిగుబ్బ గ్రామం, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా. ...వాది

V/S

సాకే హనుమంతు మరియు ఇతరులు ...ప్రతివాదులు

**5వ ప్రతివాదికి దావా నోటీసు**

పై దావాలో 5వ ప్రతివాది అయిన బత్తినేని కిరణ్ S/o లేట్ నారాయణ డ్రైవర్ నివాసము, నియర్ బంగ్లా ముదిగుబ్బ గ్రామం, ముదిగుబ్బ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

ఇందుమూలముగా తెలియజేడయడం ఏమనగా పై దావాలో మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 14/10/2024వ తేదికి వాయిదా వేసినారు.సదరు వాయిదా తేదిన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా గానీ మీ వుత్తర్వులు పొందిన వకీలు ద్వారా గాని తప్పని సరిగా హాజరు కావలెను. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:14/10/2024
స్థలం:కదిరి

కె.సుబ్బరాజు గుప్తా, బి.ఎస్.సి, బి.ఎల్,
వాదిపరం న్యాయవాది, కదిరి.

# 'పురం'లో మొదటికొచ్చిన నీటి సమస్య

## నాలుగు రోజులుగా ఆగిన నీటి సరఫరా

ధర్మపురంలో మున్సిపల్ ట్యాంకర్ ద్వారా నీటిని పడుతున్న దృశ్యం

**ప్రజాశక్తి-హిందూపురం**

గత ప్రభుత్వమా...ప్రస్తుత ప్రభుత్వమా అనేది ముఖ్యం కాదు. మొత్తానికి పాలకుల నిర్లక్ష్యం వల్ల హిందూపురం పట్టణంలో నీటి సమస్య మళ్లీ మొదటి కొచ్చింది. ఈ విషయాన్ని గత నెలలో 'ప్రజాశక్తి' పాలకులను హెచ్చరించింది. మేల్కోనక పోతే ముప్పు తప్పదని సమస్యను వివరిస్తు ప్రత్యక కథనం తీసుకొచ్చింది. అయినప్పటికి ప్రజా సమస్యలను పట్టని పాలకులు నిర్లక్ష్యం చేయడంతో నాలుగు రోజులుగా గొల్లపల్లి నుంచి హిందూపురానికి నీటి సరఫరా నిలచి పోయింది. దీంతో పట్టణ వాసులు నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం పురపాలక సంఘంలో నీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించాలని పీఏబీఆర్ నుంచి శ్రీ రామిరెడ్డి నీటి పథకం ద్వారా నీటిని తీసుకు వచ్చినప్పటికీ పట్టణ ప్రజల అవసరం మేరకు అందకపోవడంతో సమస్య అలాగే ఉండిపోయింది. దీనిని గుర్తించిన అప్పటి, ఇప్పటి స్థానిక శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ 2018 లో రూ. 194 కోట్లతో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురం పురపాలక సంఘానికి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా నీటిని తీసుకువచ్చారు. నీటి సరఫరా ప్రారంభమయ్యే గొల్లపల్లి ప్రాజెక్టు వద్ద నిర్మించిన ఇన్ టెక్ వెల్ లో మూడు మోటార్లు పనిచేయాల్సి ఉంది. ప్రస్తుతం ఇందులో రెండు మోటార్లు మరమ్మతుకు గురి కావడంతో ఒక్క మోటరు మాత్రమే పనిచేస్తోంది. వీటితో పాటు అక్కడ ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ప్యానెల్ పూర్తిగా పాతబడిపోయాయి. వాటిని తొలగించి ఆ స్థానాల్లో కొత్తగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉన్న ఒక్క మోటర్ నిరంతరం పనిచేస్తుండడంతో ఏ క్షణంలోనైనా ఆగిపోయే ప్రమాదం ఉంది. ఇక రెండవ పంపింగ్ కేంద్రమైన ఎస్‌కెడి వద్ద మూడు మోటార్లలో ఒక్కటి పూర్తిగా పాడవగా, మరొకటి బేరింగ్‌లు పోయి నిలిచిపోయింది. అక్కడ సైతం ఒక్క మోటారే పని చేస్తోంది. ఇక సోమందేపల్లి తండా వద్ద ఉన్న పంప్ హౌస్ లో రెండు ట్రాన్స్ ఫార్మర్లలో ఒకటి పనిచేయడం లేదు. మరొక ట్రాన్స్ ఫార్మర్‌లో తరచూ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక చివరిగా మోతుకపల్లి సంపు నుంచి పట్టణంలోని వివిధ ఓవర్ హెడ్ ట్యాంకులకు నీటిని ఎత్తిపోసే మోటర్లు, పంపు సెట్లు తరచూ మొరాయిస్తుండడంతో నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గత నాలుగు రోజులుగా ఎస్‌కెడి నగర్ పంపింగ్ స్టేషన్ లో పానెల్ బోర్డు, ట్రాన్స్ ఫార్మర్ మరమ్మతులకు గురి కావడంతో నీటి సరఫరా నిలిచిపోయింది.

హిందూపురం పురపాలక సంఘంలో దాదాపు 1.80 లక్షల మంది నివసిస్తున్నారు. వీరందరికీ తగినంత నీటిని అందించాలంటే రోజుకు కనీసం 20 మిలియన్ల లీటర్ల నీరు అవసరం ఉంది. అయితే గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి ఒక్క మోటారు ద్వారా అంత నీరు సరఫరా కావడం లేదు. గొల్లపల్లి నుంచి వచ్చే నీటితో పాటు పురపాలక సంఘంలో ఉన్న మోటార్ల ద్వారా వచ్చే నీటితో కలుపుకుంటే ఇందులో సగం కూడా నీటిని ప్రజలకు అందించడం లేదు. వాస్తవానికి ప్రాజెక్ట్ రూపొందించిన సమయంలో సంవత్సరానికి 0.3 టిఎంసి నీటిని జల వనరుల శాఖ హిందూపురానికి కేటాయించారు. ఈ నీటితో పట్టణానికి ప్రతిరోజు 30 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేసే అవకాశం ఉంది. పట్టణానికి నీటిని సరఫరా చేయడానికి గొల్లపల్లి ప్రాజెక్టులో ఇంటెక్ వెల్ ను, ఎస్‌కెడి, సోమందేపల్లి తండా వద్ద పంప్ హౌస్ లను నిర్మించారు. వీటి ద్వారా పట్టణంలోని కొట్నూరు వద్ద ఉన్న నీటి శుద్ధ కేంద్రానికి, అక్కడి నుంచి మోతకపల్లి సంపుకు నీటిని సరఫరా చేస్తారు. శుద్ధిచేసి పట్టణంలోని అన్ని వార్డులకు అందించాల్సి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో పైప్‌లైన్ లేకపోవడంతో ఈ నీరు పట్టణంలో కొన్ని ప్రాంతాలకు వెళ్లడం లేదు. పైప్‌లైన్ సౌకర్యాలు ఉన్న వార్డులకు మాత్రమే వారానికి ఒక్కసారి శుద్ధ జలాన్ని అందిస్తున్నారు.

పట్టణంలో ఉన్న నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే బాలకృష్ణ రూ. 194 కోట్లతో గొల్లపల్లి నుంచి హిందూపురం వరకు ప్రత్యేక పైప్ లైన్ ద్వారా నీటిని తీసుకొచ్చారు. నీటి సరఫరా ప్రారంభమైన మూడు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు వచ్చాయి. ఆ సమయంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ఈ పథకంపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. దీనికి తోడు పనులు చేసిన గుత్తేదారులకు రూ. వంద కోట్ల వరకు బిల్లులు చెల్లించలేదు. దీంతోపాటు గుత్తేదారులకు నిర్వహణ ఖర్చులు సైతం మంజూరు చేయలేదు. దీంతో నిర్వహణ సాధ్యం కాక చేతులెత్తాశారు. చేసేది ఏమీ లేక మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులే పథక నిర్వహణను చూడాల్సి వచ్చింది. అయితే నిధులు కేటాయింపు లేకపోవడం, మోటార్లు, పంపులు, ట్రాన్స్ ఫార్మర్లు, ఏర్పాటు చేసి సంవత్సరాలు గడచి పోవడంతో అన్ని మరమ్మతుకు గురవుతున్నాయి. ప్రస్తుతం వెంటనే మూడు ప్రాంతాలలో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టక పోతే సమస్య మరింత జఠిలం అయ్యే ప్రమాదముంది.

**నిధులున్నా పట్టించుకోని పాలకవర్గం**

తాగునీటి పథకంలో సమస్యలను పరిష్కరించడానికి మున్సిపల్ ఖజానాలో రూ. 2.3 కోట్లు కరువు నిధులు అందుబాటులో ఉన్నాయి. ఈ నిధుల నుంచి రూ. 1.5 కోట్లతో మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలను పాలకవర్గం దృష్టికి మూడు నెలల క్రితం తీసుకెళ్లారు. అయినా వారు పట్టించు కోలేదు. దీంతో నీటి సమస్య తీవ్రమైంది.

### పనులు పూర్తి చేసి నీటి సరఫరా ప్రారంభిస్తాం

హిందూపురం పురపాలక సంఘానికి గొల్లపల్లి ఇన్‌టెక్ వెల్ నుంచి వస్తున్న నీటిలో ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా నీటి సరఫరా అయ్యే విధంగా అవసరమైన చర్యలు తీసుకున్నాం. నేను బాధ్యతలు స్వీకరించిన వెంటనే గొల్లపల్లి ఇన్‌టెక్ వెల్ తో పాటు పంపింగ్ కేంద్రాలను పరిశీలించా. వెంటనే మోటార్లు, పంపులతో పాటు ఎలక్ట్రికల్ ప్యానల్‌లను మరమ్మతు చేయించి పూర్తి స్థాయిలో పట్టణానికి నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు చేపడుతాం.

**సంగం శ్రీనివాసులు,**
**మున్సిపల్ కమిషనర్**

## సీసీ రోడ్లు ఏర్పాటు చేయండి

**ప్రజాశక్తి - గోరంట్ల**

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ఆయా చోట్ల సీసీ రహదారులు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలోని రెవిన్యూ , మండల పరిషత్ , వ్యవసాయ , ఐకెపి, బియ్యం గోడౌన్ , ప్రభుత్వ గృహ నిర్మాణ శాఖల మండల కార్యాలయాలకు వెళ్లే రోడ్డు పూర్తి గుంతల మయంగా మారిందన్నారు. వివిధ అవసరాల నిమిత్తం కార్యాలయాలకు వందలాది మంది వస్తూ పోతుంటారన్నారు. మండల పరిపాలన అధికార యంత్రాంగం నిత్యం రాకపోకలు జరిగే రోడ్డు అధ్వాన స్థితిలో ఉండడం ఆశ్చర్యంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు , వికలాంగులు , చిన్నపిల్లలు , పాదాచారులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. ప్రజల సౌకర్యార్థం పరిపాలన యంత్రాంగం రాకపోకలను దృష్టిలో ఉంచుకొని రోడ్డు సమస్యను గుర్తించి సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న , జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత , భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గ కన్వీనర్ కొండా వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్**

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపి వైఎస్ఆర్‌టిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి వద్ద ఉన్న ఉపాధ్యాయ భవనంలో ఏపీ వైఎస్ఆర్‌టిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏవి రమణారెడ్డి, కార్యదర్శి ఇంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను గురువారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే 30 శాతం ఫిట్మెంట్ తో పిఆర్సి అమలు చేయాలని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, వేసవి సెలవులలో ప్రమోషన్లు, బదిలీలు నిర్వహించాలని కోరారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలు ప్రతినెల మొదటి వారంలో చెల్లించాలని, ఉపాధ్యాయులకు విద్యేతర కార్యక్రమాలనుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. జీవో నెంబర్ 117 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్నకృష్ణారెడ్డి, రాజగోపాల్, ప్రభాకర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, క్రిష్టప్ప, సుబ్బారెడ్డి, రామాంజనేయులు, చిన్న నాగప్ప, శ్రీనివాసులు రెడ్డి, శ్రీనివాసులు, క్రిష్టప్ప, శంకరప్ప, జయరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు ఎవి. రమణారెడ్డి

# బెదిరింపులకు భయపడొద్దు : జగన్

జగన్‌తో 'పురం' కౌన్సిలర్లు, జిల్లా అధ్యక్షురాలు, నియోజక వర్గ నాయకులు

**ప్రజాశక్తి-హిందూపురం**

స్థానిక సంస్థల్లో బలాన్ని చాటుకోవడానికి ప్రజాస్వామ్య బద్ధంగా గెలిచిన వార్డు కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని, బెదిరింపులకు భయపడొద్దని వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కౌన్సిలర్లకు సూచించారు. హిందూపురం పురపాలక సంఘంలో మున్సిపల్ చైర్ పర్సన్ తో సహ పలువురు కౌన్సిలర్లు టిడిపిలోకి చేరారు. ఆ చేరిన వారిలో నలుగురు కౌన్సిలర్లు రెండు రోజుల క్రితం వైసిపి నాయకులు వేణు రెడ్డి సమక్షంలో తిరిగి వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన కౌన్సిలర్లు, వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్, హిందూపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక, వేణు రెడ్డిలు బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తప్పు తెలుసుకుని మళ్లీ పార్టీలోకి రావడంతో వారందరిని జగన్ అభినందించారు. అదేవిధంగా పురపాలక సంఘంలో జరిగిన పరిమాణాలపై ఆరా తీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టిడిపి నాయకులు కొంతమందిని ప్రలోభాలకు గురిచేసి, మరి కొంత మందిని బెదిరింపులకు పాల్పడి పార్టీలో చేర్చుకున్నారని కౌన్సిలర్లు జగన్‌కు వివరించారు. ఇకపై తాము ఎటువంటి ప్రలోభాలకు, బెదిరింపులకు తలొగ్గేది లేదని, క్రమశిక్షణతో పార్టీలోనే కొనసాగుతామని జగన్‌కు తెలిపారు. అన్ని విషయాలను విన్న జగన్ మోహన్ రెడ్డి ఏ ఒక్కరు కూడా భయపడకుండా పార్టీ కోసం పని చేయాలన్నారు. సమావేశాల్లో ప్రజా సమస్యలపై మాట్లాడడంతో పాటు, ప్రజల తరపున పోరాటాలు చేయాలని సూచించారు. త్వరలో మున్సిపల్ చైర్ పర్సన్ కోసం ఎన్నికలు జరుగుతాయని, పార్టీ నిర్ణయించిన వారికి మద్దతుగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జున, పరశురాం, రహమత్ బి, మణీ, వైసీపీ నాయకులు మహేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# పంటసాగులో అధికారుల సూచనలు పాటించాలి

మడకశిరలో నిర్వహించిన పొలంబడిలో అధికారులు, రైతులు

**ప్రజాశక్తి - మడకశిర**

రైతులు తాము సాగు చేస్తున్న పంటలపై అధికారుల సలహాలు సూచనలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. బుధవారం మండల పరిధిలోని హరే సముద్రం, బెగారపల్లి, గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, మొక్కజొన్న, రాగి, పత్తి పంటలను పరిశీలించారు. కంది పంట ఆశాజనకంగా ఉందని పూత పిందె బాగా వచ్చి అధిక దిగుబడి పొందడానికి అవకాశం ఉందని చెప్పారు. కందిలో శనగపచ్చ పురుగు ఆశించిందని నివారణకు క్వినాల్ ఫాస్ అనే మందు 400 మిల్లీలీటర్లను 200 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహమూర్తి , సెరికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

**తనకల్లు :** మండల పరిధిలోని గౌళ్ళ పల్లిలో జనజాగృతి సంస్థ అధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎడిఎ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందే విధంగా వ్యవసాయ పద్ధతులు అవలంభించాలన్నారు. బీడు భూములను సాగు భూములుగా చేయాలన్నారు ఉత్పత్తి ఖర్చులు తగ్గించు చుకోవాలంటే సహజమైన వ్యవసాయ పద్ధతులు అలవాటు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో అగ్రికల్చర్ శాస్త్ర వేత్త నరసింహులు, వ్యవసాయ అధికారి శ్రీహరినాయక్, జనజాగృతి సంస్థ ప్రతినిధులు బాలరాం, గరుడప్ప, అగ్రికల్చర్ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

**అగళి:** మండలంలో కోడిపల్లి పంచాయతీలో అధికారులు బుధవారం పొలం పిలుసోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి నరసింహమూర్తి, వ్యవసాయ శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అధికారులు రైతులకు పంటసాగుపై పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏవో శేఖర్ నాయక్, టిడిపి మండల ఉపాధ్యక్షులు రమేష్, ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** మండలంలోని దొరిగల్లు, అడవి బ్రాహ్మణపల్లె గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు పంట పొలాలు పరిశీలించి చీడ పీడలను గుర్తించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల రైతులు, ఏవో నరసింహులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**గుడిబండ :** మండలంలోని మందలపల్లి, సిసిగిరి గ్రామాల్లో వ్యవసాయ అధికారి వీర నరేష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మరియు అనుబంధ శాఖలో జరుగుతున్న సంక్షేమ పథకాలను గురించి రైతులకు వివరించారు. అనంతరం కంది పంట పొలాలను పరిశీలించి పంటసాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వీర నరేష్, రైతు సేవ కేంద్రం అధికారులు ఉమా, మహేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

మండల పరిధిలోని కొడికొండ వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో కందూరుపర్తి గ్రామానికి చెందిన ఇరువురికి గాయాలయ్యాయి. కందూరుపర్తి గ్రామానికి చెందిన చెందిన వేణుగోపాల్ రెడ్డి, ఆయన భార్య లక్ష్మీ ప్రసన్న తమ స్వగ్రామం నుండి ద్విచక్రవాహణంలో చిలమత్తూరు వైపు వస్తుండగా కొడికొండ సమీపంలో ఈ ప్రమాదం చేసుకుంది. ఈ ప్రమాదంలో వేణుగోపాల్‌రెడ్డి, ఆయన భార్య లక్ష్మిప్రసన్న గాయలపాలయ్యారు. గాయపడిన వారిని 108 సాయంతో హిందూపురం తరలించారు. ఈ ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

## మద్యం షాపుల దరఖాస్తు గడువు పొడిగింపు

**ప్రజాశక్తి - మడకశిర**

మద్యం షాపుల దరఖాస్తుకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు ఎక్సైజ్ సిఐ ప్రసాద్ రావు తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూమద్యం టెండర్ల షెడ్యూల్‌ను మార్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు వచ్చిన నేపథ్యంలో మద్యం టెండర్ల షెడ్యూల్లో మార్పులు చేయడం జరిగిందన్నారు. ఈనెల 11 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని, 14న మద్యం షాపులకు లాటరీ తీయడం జరుగుతుందని చెప్పారు. 16 నుంచి కొత్త మద్యం విధానం అమలులోకి వస్తుందని తెలిపారు.

**హిందూపురం :** మద్యం షాపుల దరఖాస్తు స్వీకరణ గడువు ఈ నెల 11 వరకు ప్రభుత్వం పొడిగించినట్లు హిందూపురం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి దుర్గయ్య బుధవారం తెలిపారు. ఈనెల 9 తో దరఖాస్తులకు గడువు ముగియనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ గడువును ఈ నెల 11 సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సిఐ వివరించారు. ఇప్పటి వరకు హిందూపురం సర్కిల్ పరిధిలోని 11 షాపులకు గాను 109 దరఖాస్తులు అందాయని ఆయన చెప్పారు. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ఈనెల 14న డ్రా ద్వారా షాపుల కేటాయింపు జరుగుతుందన్నారు. ఆసక్తి కలవారు గడువు లోపు తమ దరఖాస్తులను పూర్తి చేసి అందజేయాలని కోరారు.

## ఎస్పీని కలిసిన డీఎస్పీ

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

పుట్టపర్తి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విజయ కుమార్ బుధవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి.రత్నను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్టు వేసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పుట్టపర్తికి వచ్చే పర్యాటకులను, బాబా భక్తులను దృష్టిలో ఉంచుకొని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

## ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా రామ్‌కుమార్

**ప్రజాశక్తి - రొద్దం**

రొద్దం ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా అదే కార్యాలయంలో పని చేస్తున్న ఎఒ రామ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలపరు. ఈ కార్యక్రమం లో ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ఖాళీపోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి - గాండ్లపెంట**

మండలంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న మూడు పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంఇఒ కృష్ణానాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక ఎంఆర్‌సిలో విలేకరులతో మాట్లాడారు. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, చౌకీదార్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**చిలమత్తూరు:** మండలంలోని బైరేకుంట వద్ద ఉన్న కస్తూర్బా బాలికల విద్యాలయంలో స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఇఒ పద్మప్రియ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 15 వరకూ మహిళా అభ్యర్థుల నుండి మండల కేంద్రంలోని ఎంఆర్సీ కేంద్రంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఓపెన్ కేటగిరీ వారు 18-42 సంవత్సరాల లోపు, ఎస్సీ,ఎస్టీ, బీసీ లు 47 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు..

## ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆర్ట్ ఫెస్టివల్

**ప్రజాశక్తి - నల్లమాడ**

మండలం కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయంలో బుధవారం ఏరియా టీమ్ లీడర్ వన్నూరస్వామి ఆధ్వర్యంలో ఆర్ట్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లమాడ ఓడిచెరువు ఏరియా నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు రంగోలి, పిక్చర్ పెయింటింగ్, పేపర్ కటింగ్, న్యాచురల్ కోలాజ్ ,హ్యాండ్ రైటింగ్ తదితర పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులు ఈ నెల 14 జిల్లాస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వేమనారాయణ, ఉపాధ్యాయులు సుగుణమ్మ, రవీంద్ర రెడ్డి, ఎటిఎల్ వన్నూరు స్వామి, సీవోలు నరసింహులు, శ్రీనివాసులు, గంగప్ప, విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తపాలా శాఖ ఆధ్వర్యంలో ఉత్తరాల పోటీలు

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రజల్లో స్టాంపుల సేకరణ పై అభిరుచి పెంపొందించడంలో భాగంగా తపాలాశాఖ ఆధ్వర్యంలో ఉత్తరాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆశాఖ హిందూపురం డివిజన్ సహాయ సూపరింటెండెంట్ మల్లికార్జున, పోస్ట్ మాస్టర్ మార్కండేయులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు లోపు ఒక విభాగం, 18 సంవత్సరాల పైబడిన వారికి మరో విభాగంగా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇంగ్లీష్, హిందీ తో పాటు అన్ని ప్రాంతీయ భాషల్లో ఉత్తరాలు రాయవచ్చన్నారు. రాసిన ఉత్తరాలను హిందూపురం డివిజన్ పోస్టల్ కార్యాలయానికి చేరుకునేలా పోస్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియ డిసెంబర్ 14వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉత్తరంగా ఎంపికైన అభ్యర్థులకు ప్రథమ బహుమతి కింద రూ. 25,000, ద్వితీయ బహుమతి కింద రూ. 10,000, తృతీయ బహుమతి కింద రూ. 5,000 నగదు పురస్కారం కింద అందజేయడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం అభ్యర్థులు తమ సమీపంలో ఉన్న తపాలా కార్యాలయాలను సంప్రదించ వచ్చని వారు వివరించారు.

## ప్రజల వద్దకే 'ఆధార్' సేవలు

**నేడు ప్రికాట్ జి మిల్లు వద్ద ఏర్పాటు**

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రజలు ఉన్న చోటే ఆధార్ సేవలు అందించాలన్న ఉద్దేశంతో తపాలా శాఖ చర్యలు తీసుకున్నట్లు స్థానిక అదనపు తపాలా సూపరింటెండెంట్ మల్లికార్జున, పోస్ట్ మాస్టర్ మార్కండేయులు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం పరిగి మండల పరిధిలోని గొరవనహళ్లి ప్రీ కాట్ మిల్లు వద్ద ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిల్లులో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు, చుట్టుపక్కల నివసించే ప్రజలు తమ ఆధార్ కార్డులో తప్పులు ఉన్నా, కొత్త ఆధార్ కార్డు చేసుకోవాలన్నా, ఫోన్ నెంబర్ మార్చాలన్న, అడ్రస్ మార్చాలన్న తగిన ఆధారాలు తీసుకొచ్చి ఆధార్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

## నవోదయ విద్యార్థికి రాష్ట్రస్థాయి బహుమతి

**ప్రజాశక్తి - లేపాక్షి**

మండల కేంద్రంలో యూనివర్సిల్ పోస్టల్ యూనియన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన లెటర్ కాంపిటేషన్‌లో రాష్ట్రస్థాయిలో లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థిని హేమలత తృతీయ బహుమతి సాధించింది. బుధవారం వరల్డ్ పోస్ట్ డే సందర్భంగా ఆ విద్యార్థినికి రూ.5 వేలు చెక్కుతో పాటు ప్రశంసాపత్రాన్ని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ముంతాజ్‌బేగం సమక్షంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండ్ టిఎస్.మల్లికార్జున, హెడ్ పోస్ట్‌మాస్టర్ మార్కెండేయ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఒపిఎస్ఐ నరసింహమూర్తి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'పల్లె పండుగ 'వారోత్సవాలను జయప్రదం చేయండి

**ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్**

సమగ్ర గ్రామీణ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 14 నుంచి 19 వరకు ఎమ్మెల్యే సింధూరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే పల్లె పండుగ వారోత్సవాలని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఇందులో భాగంగా పుట్టపర్తి నియోజకవర్గం లో రూ.20 కోట్లతో అన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో సిసి రోడ్లు, డ్రైనేజీ ,కల్వర్టు నిర్మాణ పనులకు భూమి పూజ చేయనున్నారన్నారు. ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యేతో పాటు పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరవుతారని చెప్పారు.ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాదికి నియోజకవర్గంలో మంజూరైన రూ. 20 కోట్ల నిధులతో ఈ పనులు ఆయా పంచాయతీల్లో చేపట్టనున్నారన్నారు.